క్లుప్తంగా

జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ



కాకుమాను: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ప్రతి విద్యార్థిని కష్టపడి చదవాలని జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల(బాలికలు)పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుల్జార్ బేగం మాట్లాడుతూ పేదరికం విద్యకు అడ్డురాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు కల్పించారన్నారు. పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటు ఎంతో విలువైనది



చినలింగాయపాలెం(కాకుమాను): ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని హెచ్ఎం బి.శ్రీనివాసరావు అన్నారు. చినలింగాయపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రజాస్వామ్యంలో ఓటు విలువ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 25న నిర్వహించనున్న ఓటర్స్ డే సందర్భంగా.. విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్ కింద అవగాహన కల్పించినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులతో ఎన్నికల సిబ్బంది, పోలీసులు, ఓటర్లు ఎలా ఓటు హక్కు వినియోగించుకుంటారో వివరించారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రత్తిపాడు: స్త్రీ నిధి రుణాలను స్వయం సహాయక సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని స్త్రీ నిధి ఏజీఎం చెన్నకేశవులు అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం ఆయన స్త్రీ నిధిపై ఏపీఎం, సీసీలతో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రత్తిపాడు మండలానికి రూ.4 కోట్లు స్త్రీ నిధి టార్గెట్ ఇవ్వడం జరిగిందని, గతంలో ఎన్నడూ లేని విధంగా సిబ్బంది సహకారంతో రూ.5 కోట్ల గ్రౌండింగ్ చేసినట్లు చెప్పారు. అయితే రికవరీలో వెనుకబడ్డామని తెలిపారు. అనంతరం పెదగొట్టిపాడు, నడింపాలెం గ్రామాల్లో పర్యటించారు. స్త్రీ నిధి బకాయిలు ఉన్న డ్వాక్రా గ్రూపుల సభ్యులతో మాట్లాడారు. రుణం పొందిన వారు సకాలంలో చెల్లిస్తేనే ఇతరులకు రుణాలు ఇవ్వగలుగుతామని మహిళలకు వివరించారు. ఆయన వెంట ఏపీఎం జి. సురేష్ కుమార్, సీసీ సాంబయ్య ఉన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

ప్రత్తిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల మేరకు.. చినకోండ్రుపాడు గ్రామానికి చెందిన మాకాని రామయ్య అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారంతో గురువారం రాత్రి ఎస్ఐ డి.రవీంద్రబాబు తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. అతని నుంచి ఏసీ బ్లాక్ క్లాసిక్ విస్కీ 180 ఎంఎల్ నాలుగు బాటిళ్లు, గోల్డెన్ పెరల్ విస్కీ 180 ఎంఎల్ ఒక బాటిల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రామయ్యపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

ప్రత్తిపాడు: రహస్యంగా పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. వట్టిచెరుకూరు మండలం కర్నూతలలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారన్న స్పెషల్ బ్రాంచి సమాచారంతో ఎస్ఐ కె. కోటేశ్వరరావు శుక్రవారం తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.21,400ల నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



తెనాలిఅర్బన్: దాసాకూటి ఆశ్రమం వారి ఆధ్వర్యంలో అంగలకుదురు గ్రామంలో అయోధ్యలోని శ్రీరాముని అక్షింతలను శుక్రవారం ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ మాట్లాడుతూ అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, శ్రీరాముని జెండాలను గ్రామంలో పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కఠారి వాసుదేవనాయుడు, కడియాల నందకిషోర్, కనగాల హరి, భారతి, అల్లూరి పద్మ, శైలజ, మాలతి, ప్రశాంతి, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వరం.. 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోశయ్య

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు . శుక్రవారం వెల్లలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, వైద్య పరీక్షలపై సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఇక్కుర్తి మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యశాలల్లో పూర్తిస్థాయిలో వైద్యాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో వైఎస్సార్ హెల్త్ సెంటర్లను నిర్మించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత విజయవంతమై, ప్రజలకు సంతృప్తికరంగా వైద్యసేవలు అందడంతో మరలా రెండో విడతను ప్రారంభించారని వెల్లడించారు. ఈ సందర్భంగా 750 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్. సైపుల్లా, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, వైస్ ఎంపీపీ అంబటి రాఘవయ్య, నాయకులు కోట శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, నాయకులు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పట్టణంలోని శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి, వీరాంజనేయ స్వామి దేవస్థానంలో నూతన భవనాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావన్నారాయణ స్వామి, కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో రూ. 45 లక్షలతో నిర్మించనున్న మండపం, షెడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం టీచర్స్ కాలనీలోని రోటరీ సర్వీస్ సొసైటీ బిల్డింగ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పట్టణంలోని సహస్ర లింగేశ్వరస్వామి, వీరాంజనేయ స్వామిని శుక్రవారం ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెప్పాడంటే చేస్తాడంతే



పింఛను నగదు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్

- ఇచ్చిన మాట ప్రకారం పింఛను నగదు రూ.3వేలకు పెంపు
- ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

ప్రత్తిపాడు: ఎన్ని కష్టాలు వచ్చినా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ అన్నారు. ప్రత్తిపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎ. రమ్యశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్సార్ పింఛను కానుక వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బలసాని కిరణ్ కుమార్ వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పెంచిన రూ.3వేల పింఛను నగదు పంపిణీ చేశారు. నూతనంగా పింఛను మంజూరైన 102 మంది నగదు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం వైఎస్ జగన్ రూ.2వేలు ఉన్న పింఛనును రూ.3వేల వరకూ పెంచుకుంటూ వచ్చారన్నారు. వృద్ధులకు పెద్ద కొడుకుగా నిలిచి, వారి మోముల్లో చిరునవ్వులు చిందిస్తున్న జగనన్న రుణం ఏమిచ్చి తీర్చుకోగలమని కొనియాడారు. మరోసారి ఓటు వేసి జగనన్నతో పాటు, తననూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అన్నమ్మ, ఎంపీటీసీ షేక్ ఆఫ్రీనా సుల్తానా, మార్కెట్ యార్డు డైరెక్టర్ బాపతు వెంకటరమణ, ప్రత్తిపాడు ఉప సర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి, కొత్తమల్లాయపాలెం సర్పంచ్ కుందూరి లక్ష్మారెడ్డి, పార్టీ సేవాదళ్ జిల్లా కన్వీనర్ మురళి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.




సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బలసాని, లబ్ధిదారులు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు


గుంటూరు రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషిచేస్తున్నారని పత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం తురకపాలెం గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పింఛను కానుక సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలో మొత్తం 4,756 మంది పింఛన్‌దారులకు పెంచిన పింఛను నగదుతో లబ్ధి చేకూరిందన్నారు. 77 మందికి నూతనంగా పింఛన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, వైఎస్ ఎంపీపీ దర్శి సుజాత, మండల ప్రత్యేక అధికారి ఎల్ వజ్రశ్రీ, ఎంపీడీఓ ఆదినారాయణ, ఈవో పీఆర్డీ శ్రీనివాసరావు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. తురకపాలెం గ్రామంలోని పింఛనుదారులు ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మెట్టు వెంకటప్పారెడ్డి, ఆళ్ళ రవిదేవరాజు, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరీ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛను



పెదకాకాని: చినకాకాని ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుంటగాని చింతయ్యకు వలంటీర్ ఇల్లా కోటేష్ శుక్రవారం పింఛను అందజేశారు. పెదకాకాని సచివాలయం 3 పరిధిలో అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన చింతయ్య డప్పు కళాకారుడిగా పింఛను పొందుతున్నాడు. ఆయన ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో ఊపిరితిత్తుల సమస్యతో చికిత్స పొందుతుండటంతో.. వలంటీర్ ఇల్లా కోటేష్ ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశారు.

గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు కిట్స్ విద్యార్థి ఎంపిక



విద్యార్థి గోపీకృష్ణ

ప్రత్తిపాడు: దేశ రాజధాని ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆర్‌డీసీ 2024 ఎన్‌సీసీ పరేడ్ కి కిట్స్ కళాశాల విద్యార్థి ఎంపికయ్యాడు. స్థానిక కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న పి. గోపీకృష్ణ 25(ఏ) ఎన్‌సీసీ బెటాలియన్ గుంటూరు గ్రూపు తరపున హైదరాబాద్ ఆర్మీ శిక్షణా శిబిరంలో శిక్షణ పొంది, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టర్ నిర్వహించిన పరీక్షలో ఎంపికయ్యారు. ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్నట్లు కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శుక్రవారం గోపీకృష్ణను యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పదిహేడు డైరెక్టరేట్ ల నుంచి పాల్గొనే వేడుకల్లో తమ కళాశాల విద్యార్థి ఎంపికవ్వడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు పాల్గొన్నారు.

జిల్లా వైద్యశాలలో ఆర్‌ఓపీ స్క్రీనింగ్

తెనాలిఅర్బన్: బరువు తక్కువతో పుట్టిన చిన్నారులకు జిల్లా వైద్యశాల ఆవరణలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో శుక్రవారం రెటినా ఆఫ్ ప్రీ మెట్యూరిటీ స్క్రీనింగ్ నిర్వహించారు. చిన్నారుల్లో కంటి చూపు, వినికిడి శక్తి ఎలా ఉంది అనే దానిపై పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ పావని, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మధుబాబులు మాట్లాడుతూ రాజమండ్రికి చెందిన గౌతమి ఐ హాస్పిటల్ సహకారంతో లేజర్ పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆడియాలజిస్ట్ డాక్టర్ నివేదిత, డెంటల్ వైద్యులు డాక్టర్ సుజాత, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ విశ్వశాంతి, సైకాలజిస్ట్ డాక్టర్ నాగ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ డైరీ ఆవిష్కరణ

పాత గుంటూరు: రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ నూతన డైరీని ఏపీసీపీడీసీఎల్ చైర్మన్ కె. సంతోష్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ బి.జయభారత్ రావు, ఏపీ ట్రాన్స్‌కో ఫైనాన్స్ డైరెక్టర్ టి. వీరభద్రారెడ్డి, జెన్‌కో హెచ్‌ఆర్ డైరెక్టర్ సయ్యద్ రఫీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శివకుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.వి.కిరణ్, పి.దాసు బాబు, ఎం.వసంతరావు, ఎం.చంద్రశేఖర్, ఒ.సారథి పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న యువకుల అరెస్ట్

పెదకాకాని: గంజాయి తాగుతున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని, అరెస్టు చేసినట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు. మండలంలోని నంబూరు అలీరఫత్ నగర్ డొంకలో గురువారం గస్తీ తిరుగుతున్న రక్షక్ వాహనం చూసి ముగ్గురు యువకులు పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా గంజాయి తాగుతున్న సమయంలో పోలీసు వాహనం చూసి పారిపోతున్నట్లు గుర్తించారు. వారి నుంచి 120 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నంబూరు గ్రామానికి చెందిన వేమూరి షోరోన్, వట్లూరి తిరుమల, గుంటూరుకు చెందిన కుర్రా వంశీలుగా వారిని గుర్తించారు. విచారణలో వల్లూరి బాపయ్య అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. నిందితులను శుక్రవారం అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరచినట్లు ఎస్ఐ వినోద్ తెలిపారు.

రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలి



చేబ్రోలు: వాహనదారులు రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని తెనాలి ఆర్టీఓ కె.ప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరులోని సెయింట్ మేరీస్ కళాశాలలో శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని సూచించారు. ప్రమాదం జరగకముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రైనీ ఆర్టీఓలు మనోహర్, భరత్ చవాన్ మాట్లాడుతూ వాహనదారులు, పాదచారులు రహదారి నియమనిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. అతివేగం ప్రమాదకరమని, వాహనాలు నడుపుతూ సెల్ ఫోన్ మాట్లాడకూడదన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని తెలియజేశారు. ఏఎంవీఐ మధుసూదన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత వివరించారు. ఎంవీఐ రాఘవరావు రహదారి భద్రత వీడియోలను ప్రదర్శించి, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం హిమబిందు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ అరెస్ట్

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. చేబ్రోలులోని విజన్ యూనివర్సిటీలో పని చేసే చేబ్రోలు మండలం శేకూరుపాలెంకు చెందిన నెమలికంటి బాబురావు(43) ఈ నెల 3వ తేదీ రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతున్నాడు. తెనాలి మండలం సంగంజాగర్లమూడి లాకుల వద్ద కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నిందితుడు చిలకలూరిపేట సమీపంలోని గణపవరంకు చెందిన బందారు వెంకట నాగ అజయ్‌గా గుర్తించి శుక్రవారం అరెస్ట్ చేశారు.

యువతి ఆత్మహత్య

తెనాలిరూరల్: పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు సంబంధాలు చూస్తుండడంతో ఇష్టంలేని యువతి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన కుంచాల స్వాతి(24) ఎం ఫార్మసీ చదివింది. కుమార్తెకు వివాహం చేసేందుకు తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు సంబంధాలు చూస్తున్నారు. వివాహం ఇష్టం లేని ఆమె గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు.

వీర ప్రకాశరావుకు విశిష్ట పురస్కారం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో గుంటూరు నగరానికి చెందిన లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ నూతలపాటి వీరప్రకాశరావు విశిష్ట పురస్కారానికి ఎంపిక చేసింది. సమాజంలోని వివిధ రంగాల్లో విస్తృతమైన సేవలు అందించిన ప్రముఖులకు శనివారం రాజమహేంద్రవరంలోని రాజరాజ నరేంద్ర కళా వేదికపై పురస్కారాలతో సత్కరించనున్నారు.

విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- నగర మేయర్ మనోహర్‌నాయుడు
- ప్రతి గ్రామం అభివృద్ధి జగనన్న లక్ష్యం
- సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి, సమన్వయకర్త కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. బుడంపాడులో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బాలసాని కిరణ్ కుమార్‌తో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. మేయర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ విలీన గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రణాళికా బద్ధంగా నిర్వహిస్తు నామన్నారు. అందులో భాగంగానే కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించినట్లు తెలిపారు. రూ.50లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. సమన్వయకర్త బలసానికి కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు, బీసీల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. వైఎస్ జగన్‌ను మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్థానిక కార్పొరేటర్ దాసరి లక్ష్మి, పార్టీ ఇన్‌చార్జి పెద్దింటి రామకోటి, పాస్టర్ నిరంజన్‌పాల్, కమ్యూనిటీ హాల్ కమ్యూనిటీ హాల్ సభ్యులు మోషే, సురేష్, ఆళ్ళ రవిదేవరాజు, ప్రభుదాస్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దేటమ్మ తల్లి పీఠం వార్షికోత్సవం



పెద్దేటమ్మ తల్లి పీఠం ఉత్సవాల్లో అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు(గుంటూరు): గత ఏడాది పొన్నూరు మండలం, మామిళ్ళపల్లి గ్రామంలో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్మించిన పెద్దేటమ్మ తల్లి పీఠం మొదటి వార్షికోత్సం ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల వార్షికోత్సవాల్లో శుక్రవారం అంబటి మురళీకృష్ణ పాల్గొని, యజ్ఞం నిర్వహించారు. గ్రామోత్సవం ఉత్సవ విగ్రహంతో ఘనంగా జరిగింది. శనివారం అన్న ప్రసాద వితరణ చేయడానికి గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. ఇటీవల సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి రావాలని 'రాజశ్యామల' యాగం ఇదే గ్రామంలో పెద్దేటమ్మ తల్లి పీఠానికి సమీపంలో నిర్వహించడం , యాగం విజయవంతం కావడం అందరికీ తెలిసిన విషయమే.

రేపు బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం

కొరిటిపాడు(గుంటూరు): సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపరను కొనసాగిస్తోందని, అందులో భాగంగా ఆదివారం పొన్నూరు మండలంలోని బ్రాహ్మణ కోడూరు, జూపూడి గ్రామాల్లో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో బజరంగ్ – నేత్రజ్యోతి, బజరంగ్ – మీ గుండె పదిలం, బజరంగ్ – దివ్యాంగ దర్శిని, ఫిజియో థెరపీ సేవలు ఉచితంగా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. నేత్రజ్యోతి ద్వారా కళ్లజోళ్లు, మీ గుండె పదిలం ద్వారా గుండె సర్జరీలు, స్టెంట్లు వేయించడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగులకు ఉచితంగా త్రి చక్ర వాహనాలు, జైపూర్ కాలు, వెస్ట్రన్ కమోడు సమకూర్చడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

మలినేనిలో డిజైన్ థింకింగ్‌పై వర్క్‌షాప్



అవగాహన కల్పిస్తున్న కంపెనీల ప్రతినిధులు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం డిజైన్ థింకింగ్‌పై వర్క్ షాప్ నిర్వహించారు. ఐడియా ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్‌పై ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరిగిన వర్క్ షాప్‌కు ముఖ్య అతిథులుగా ఐడియా ల్యాబ్స్ సీఈఓ పంకజ్ దివాన్, డిజైన్ థింకింగ్ ఎవాంజలిస్ట్ ఆర్. శ్రీకాంత్ హాజరయ్యారు. డిజైన్ థింకింగ్, మైండ్ మ్యాపింగ్ టెక్నిక్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మలినేని కళాశాలల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ విద్యార్థులు నూతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవాటు చేసుకుని అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె. అప్పారావు, డీన్ రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు భవిష్యత్తుపై ఆశ కలిగించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐఏఎన్ఎల్‌పీ ప్రెసిడెంట్ విశేష్, వర్సిటీ సిబ్బంది

చేబ్రోలు: విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు వారికి భవిష్యత్ మీద ఆశ కలిగించాలని ఐఏఎన్ఎల్‌పీ (ఇంటర్నేషనల్ న్యూరో లింగ్విస్టిక్ ప్రోగ్రాం) ప్రెసిడెంట్ విశేష్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఎంపవరింగ్ త్రూ ప్రివెన్షన్ - ప్రొఫెషనల్ ట్రైనింగ్ ఆన్ లైఫ్–సేవింగ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై మూడు రోజుల పాటు అధ్యాపకులకు, కౌన్సిలర్‌లకు వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. ఐఏఎన్ఎల్‌పీ ప్రెసిడెంట్ విశేష్ మాట్లాడుతూ అధ్యాపకులుగా ఎల్లప్పుడూ విద్యార్థులను సరికొత్తగా ఆలోచించే విధంగా ప్రోత్సహించాలన్నారు. తరగతిగదిలో ఉపాధ్యాయుడు లీడర్‌గా మారి తన ఫిలాసఫీని, తన ఆదర్శాలను విద్యార్థుల ముందుంచి వారిని గొప్ప ఆవిష్కర్తలుగా తయారు చేయాలని సూచించారు. జీవీఏ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైకాలజీ ఫౌండర్, క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ గోగి మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థుల సమస్యలను గుర్తించడంతో పాటు వారి భావోద్వేగాలను అర్థం చేసుకుని సునిశితంగా పరిష్కరించాలన్నారు. జీవితంలో ప్రతి విద్యార్థి కూడా కఠినమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. విద్యార్థులు ధైర్యంతో ముందుకు సాగితే జీవితంలో ఏదైనా సాధించగలరని నమ్మకాన్ని వారిలో కలిగించాలన్నారు. విద్యార్థుల ఎదుగదలలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఏపీఏఐ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్రిష్ణ భరత్, జి.రాజేశ్వరరావు, రవిభార్గవ్, ఎంపీ జానకిరామ్, పీవీపీ ప్రసాద్ అత్తోట తేజ, వైస్ చాన్స్‌లర్ పీ.నాగభూషణ్ పాల్గొన్నారు.

డిపోను అగ్రగామిగా నిలపండి

ఆర్టీసీ గుంటూరు రీజనల్ మేనేజర్ ఎం.రవికాంత్



ఉద్యోగులతో మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ రవికాంత్

తెనాలిఅర్బన్: అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తూ తెనాలి డిపోను రీజనల్ పరిధిలోనే ప్రథమస్థానంలో నిలపాలని ఆర్టీసీ గుంటూరు రీజనల్ మేనేజర్ ఎం.రవికాంత్ సూచించారు. తెనాలి డిపోన్ శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్యారేజిలో ఉద్యోగులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సుల నాణ్యత ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉద్యోగులు కూడా మంచి నైపుణ్యాన్ని కలిగి ఉండాలన్నారు. బస్సులు బ్రేక్ డౌన్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారికి మంచి సేవలు అందించాలన్నారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని సాధ్యమైనంత వరకు వాటిని పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మేనేజర్ ఎ.రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ఐజే ప్రసాదరావు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్ఏ నాయక్, తదితరులు పాల్గొన్నారు.